# మిర్చి, పసుపు ధరల పతనం

## రైతుల జీవితాలతో ప్రభుత్వం, బడావ్యాపారుల చెలగాటం

**భూమే** ప్రాణంగా, భూమినే నమ్ముకొని జీవనం సాగిస్తూ వివిధ రకాల పంటలు ఉత్పత్తిచేస్తూ, దేశ ప్రజలకు ఆహారాన్ని అందిస్తున్న రైతాంగం, ఆ పంటలను అమ్ముకొనేటప్పుడు దేనికీ న్యాయమైన ధర లభించక, పెట్టిన పెట్టుబడి కూడా రాక, అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకొంటున్న హృదయవిదారక పరిస్థితులు నేడు దేశంలో, రాష్ట్రంలో నెలకొని వున్నాయి. రైతులు అమ్ముకొనేటప్పుడు ధరలను పతనంచేసి, ఆ పంటలు తమ చేతుల్లోకి వచ్చిన తర్వాత ధరలు పెంచి రైతాంగాన్ని, వినియోగదారులను దోచుకొంటున్న బడా వ్యాపారుల దోపిడీకి ఇది అద్దంపడుతున్నది. రైతుల వద్ద పంట ఉత్పత్తులులేని సమయంలో పెంచిన ధరలను, ధరల పెరుగుదలగా చూపెట్టి రైతాంగాన్ని-ప్రభుత్వం, బడావ్యాపారులు మోసగిస్తున్నారు. ఇలా పెరిగిన పంట ధరలు భూస్వాములకు, ధనిక రైతులకు మాత్రమే ఉపయోగపడుతున్నాయి.

గత సంవత్సర ప్రారంభంలో మిర్చి ధర అంతగా ఆశాజనకంగా లేకపోయినా తర్వాత మిర్చి ధర పెరిగి క్వింటాల్‌కి రు.12 వేలకు పైగా ధర లభించింది. ఆ ధర లభిస్తుందనే ఆశతో ఈ సంవత్సరం కూడా దుర్భిక్ష పరిస్థితుల్లోనూ హైబ్రీడ్ లక్షా యాభైవేలు, నాటు రకానికి లక్షా 20 వేలు ఖర్చుచేసి, అనేక అవస్థలుపడి పంట పండించారు. పంట పండి అమ్ముకోవటానికి మార్కెట్‌కి వెళ్లిన రైతు గుండె నీరుకారిపోయింది. గతంలో రు.12 వేలు పలికిన ధర 7 వేలకు పడిపోయింది. ఆ ధర కూడా లేక నేడు రు. 3,500 నుండి 4 వేలు మాత్రమే లభిస్తోంది. 'క్వింటా నాలుగువేలకి అమ్ముతారా! తీసుకొని వెళతావా' అని బెదిరిస్తున్నారు. 'ఉదయం వ్యాపారి వచ్చి ఒక రేటు చెబితే, మధ్యాహ్నానికి మరలా ధర తగ్గిస్తారు. మరో వ్యాపారి 3 వేలు, రెండు వేలు అంటారు' అని రైతాంగం ఆందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితి రైతాంగానికి దిక్కుతోచని పరిస్థితి కల్పించింది. మార్కెట్ యార్డుకి తెచ్చినా లభించే ధరకు ఖర్చులు కూడా రాని పరిస్థితుల్లో చాలా చోట్ల రైతులు పంట కోతను మానుకొన్నారు. కొందరు చెరి సగం పంట పంచుకొనే విధంగా కూలీలతో ఒప్పందం చేసుకొంటున్నారు. ఇంకా రెండవ కోత కూడా పూర్తికాకుండానే ధర ఇలా వుంటే, పూర్తిగా పంట చేతికివస్తే పరిస్థితి ఇంకా ఎలా వుంటుందోనని భయపడుతున్నారు.

మిర్చి ధర తగ్గటానికి సాగు విస్తీర్ణం పెరగటం కారణంగా ప్రభుత్వం, బడావ్యాపారులు చెప్పటం రైతులను వంచన చేయటమే. కొంతమేర విస్తీర్ణం పెరిగినా, దిగుబడులు గణనీయంగా తగ్గాయి. రాష్ట్రంలో మూడువంతులు సన్నరకం(నాటు), ఒక వంతు హైబ్రీడ్ రకం వేస్తారు. హైబ్రీడ్ రకం విత్తనాలు చాలా ఎక్కువ ఖరీదు వుంటాయి. సన్నరకం సాధారణ దిగుబడి 15 నుండి ఇరవై క్వింటాళ్ళు వస్తుంది. హైబ్రీడ్ 35 నుండి 40 క్వింటాళ్ళు వస్తుంది. ఈ సంవత్సరం అనావృష్టి-అతివృష్టి మూలంగా దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయి. ప్రకాశం, గుంటూరు, కృష్ణా జిల్లాల్లో ఆ స్థాయిలో ఈ సంవత్సరం దిగుబడులు రాలేదు. ప్రకాశంజిల్లా మార్కాపురం, గిద్దలూరు ప్రాంతాల్లో నీరు లేక దిగుబడి 2 నుండి 5 క్వింటాళ్ళకి మించి రాలేదు. ఈ వాస్తవాన్ని గమనిస్తే నిరుడుకన్నా దిగుబడి పెరిగే పరిస్థితి లేదు. అంతేకాకుండా మూడు కోతలు పూర్తిగా పంట చేతికి అందకుండానే ఉత్పత్తి ఎక్కువ పేరుతో ధర ఎలా పతనమౌతుంది? ఇది మార్కెట్‌శక్తుల మాయాజాలాన్ని తెలియజేస్తుంది.

మిర్చి పంటకు సరైన ధర లభించక అమ్మకానికి ఇష్టపడని రైతులు, ధర లభించేదాకా శీతల గిడ్డంగుల్లో నిల్వచేసు కొంటున్నారు. అలా నిల్వచేసుకొన్న సరుకుపై బ్యాంక్‌లు రుణం ఇచ్చి 10.5 శాతం వడ్డీ వసూలు చేస్తున్నారు. నెలా పదిహేను రోజుల క్రితం బస్తా(40కేజీలు)కి 1200 చొప్పున బ్యాంక్‌లు అప్పులు ఇవ్వగా, ధరలు పడిపోయాయనే పేరుతో ఇప్పుడు రైతులకు రుణాలు ఇవ్వటంలేదు. మిరప పంటపై రుణాలు ఇవ్వవద్దని తమకు ఆదేశాలు వచ్చాయని బ్యాంక్ అధికారులు చెబుతున్నారు. కొన్ని ఇచ్చినా 600 రూ. మాత్రమే ఇస్తున్నారు. బడా పరిశ్రమాధిపతులు, వ్యాపారులు లక్షల కోట్లు చెల్లించకపోయినా మొండిబకాయిల పేరుతో వాటిని రద్దుచేయటమేకాకుండా తిరిగి వేల కోట్లు అప్పులు ఇస్తున్న బ్యాంక్‌లు, కష్టాల్లో వున్న రైతుల పంటను తాకట్టుపెట్టుకొని అప్పు ఇవ్వమంటే అందుకు నిరాకరిస్తున్నాయంటే అవి ఎవరి ప్రయోజనాలకోసం పని చేస్తున్నదీ అర్థమౌతుంది. ఇలాంటి పరిస్థితుల్లో కోత కూలి చెల్లించటానికి, రవాణా ఖర్చులకోసం కమీషన్ వ్యాపారులవద్ద పంట తాకట్టుపెట్టి అధిక వడ్డీకి రైతులు అప్పులు తీసుకొంటున్నారు.

మార్కెట్ యార్డుల్లో నిల్వ చేసుకొనే రైతులకు పంట విలువలో 75 శాతం లేదా రెండు లక్షల రూపాయలకు తగ్గకుండా వడ్డీలేని రుణాలు యిచ్చి 180 రోజుల లోపు ఆ రుణం తీర్చే అవకాశం వుంది. అదీ సక్రంగా అమలు జరగటంలేదు. ఆపదలో వున్న చిన్న, సన్నకారు మిర్చి రైతులకు ఆ పథకాన్ని అమలుజరిపి ప్రభుత్వం ఆదుకొనే ప్రయత్నం ఎందుకు చేయటంలేదు? 5 వేల కోట్లతో పంటల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తామని చెప్పిన చంద్రబాబు దాన్ని ఎందుకు ఏర్పాటు చేయలేదు? మిర్చి రైతులను ఆదుకోవటానికి ఇప్పుడైనా ఆ పథకాన్ని ఎందుకు ప్రకటించలేదు? దాని గురించి ఎందుకు మాట్లాడటంలేదు?

తమకు ఇష్టమైన ధర వచ్చేదాకా కోల్డ్‌స్టోరేజీల్లో రైతులు నిల్వచేసుకోవటం కూడా సమస్యగా మారింది. రైతుల ప్రస్తుత పరిస్థితిని ఆసరా చేసుకొని కోల్డ్ స్టోరేజీ యజమానులు సొమ్ముచేసుకొనే విధానాలు చేపట్టారు. శీతల గిడ్డంగుల్లో నిల్వచేసి బీమా చేసే సరుకుపై ఏడాది అద్దె వసూలు చేస్తారు. గత సంవత్సరం బస్తాకి 170 రూ. వుండగా ఇప్పుడు 230 రూ.కు పెంచారు. క్వింటా

నిల్వచేయటానికి 575 రూ. చెల్లించాలి. ఇంతకు ముందు ప్రతి సంవత్సరం రైతాంగం సరుకు అమ్మిన తర్వాత అద్దె వసూలు చేసేవారు. ఇప్పుడు ముందుగానే వసూలు చేస్తున్నారు. ఇది రైతాంగానికి భారంగా మారింది.

మిరప రేట్లను తగ్గించిన బడావ్యాపారులు, శీతల గిడ్డంగులను తమ స్వాధీనంలో వుంచుకొంటున్నారు. ఒక్కొక్కరు 10 నుండి 20వేల బస్తాలవరకు నిల్వచేసేలా గిడ్డంగుల యజమానులతో ఒప్పందం చేసుకొంటున్నారు. వారికి ముందే డబ్బులు చెల్లిస్తున్నారు. ఫలితంగా రైతాంగం నిల్వచేసుకొనేందుకు అవకాశం లేకుండా తక్కువ ధరకు అమ్ముకొనే పరిస్థితి కల్పిస్తున్నారు. రైతులనుండి సరుకు చేతులు మారిన తర్వాత కృత్రిమ కొరత సృష్టించి, రేటు పెంచి శీతల గిడ్డంగుల నుండి సరుకు బయటకుతీసి అమ్మి లాభాలు గడిస్తారు. ఇది బడా వ్యాపారుల వ్యూహాత్మక విధానం.

ప్రభుత్వం, బడా వ్యాపారులు కుమ్మక్కై అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా రైతాంగం ఆందోళన బాటపట్టారు. న్యాయమైన ధర ఇవ్వనందుకు నిరసనగా-ప్రభుత్వం, వ్యాపారులు, యార్డుపాలక వర్గానికి వ్యతిరేకంగా చిలకలూరిపేట - నర్సరావుపేట రోడ్ల వైపు మొదటి గేట్లను మూసివేశారు. జాతీయ రహదారిపై బైఠాయించి ఉదయం 10 గం|| నుండి మధ్యాహ్నం 2 గం||ల వరకు రాస్తారోకో నిర్వహించటంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్థంభించిపోయింది. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు పెద్దఎత్తున మారుమ్రోగాయి. 5 వేలకోట్లతో స్థిరీకరణ నిధి ఏర్పాటు చేయాలని, మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటా పదివేలకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మిర్చి పంటను రోడ్లపై పోసి తగులబెట్టి నిరసన తెలపటం, అధికారులను ఘెరావ్‌లు చేయటంలాంటి అనేక కార్యక్రమాలు చేశారు. సమస్యను పరిష్కరించని ప్రభుత్వం రైతులను అరెస్టు చేయటం, లాఠీఛార్జీలాంటి నిర్బంధంతో విరుచుకుపడింది. ధరలు పడిపోయి పెట్టుబడి కూడా రాని పరిస్థితుల్లో అప్పులు తీరే మార్గంకానరాక అనేకమంది రైతులు బలవన్మరణాల పాలయ్యారు; ఆ వార్తలు రోజూ వస్తున్నాయి.

తమపై మిర్చి రైతుల ఆగ్రహం తీవ్రమౌతుం డటంతో, దాన్ని దారి మళ్లించే మాటలు ప్రభుత్వం చెప్పటం ప్రారంభించింది. మిర్చి పంటకు గిట్టుబాటు ధర లభించేలా కేంద్రంతో చర్చలు జరపనున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి చెప్పటం అందులో భాగమే. మిర్చి రైతులు నష్టపోకుండా ఎలాంటి కార్యాచరణ అందించాలనే దానిపై వ్యవసాయ, మార్కెట్‌శాఖ అధికారులతో చర్చలు జరుపుతామని, ముఖ్యమంత్రితో మాట్లాడి, అదనపు ధర ఇచ్చే విషయం నిర్ణయిస్తామని, కొనుగోళ్ళ గురించి నాఫెడ్, వ్యవసాయశాఖ అధికారులతో సంప్రదింపులు జరుపుతామని మంత్రి చెప్పుకొచ్చారు.

వ్యవసాయశాఖమంత్రి చెప్పిన మరుసటిరోజే మిర్చి రైతులను ఆదుకొనేందుకు క్వింటాల్‌కి 1500 రూ. అదనంగా ఇస్తామని, క్వింటాల్ మిర్చి ధరను 8 వేలుగా నిర్ణయించామని, ఆలోపు ధరకు అమ్ముకొన్న వారికే ఇది వర్తిస్తుందని రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది. 8 వేలకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని చెప్పలేదు. ఆ ధరకే వ్యాపారులు కొనాలని ఆదేశిస్తామనీ చెప్పలేదు. మార్క్‌ఫెడ్ ద్వారా అనేక పంటలు కొనుగోలు చేస్తామని చెప్పి నామమాత్రపు కొనుగోళ్ళకే పరిమితం చేయటం జరిగింది. మిర్చి కొనుగోళ్ళు చేసినా అందుకు మినహాయింపుగా వుండదు. ఇచ్చే అదనపు మొత్తం కూడా ప్రభుత్వం బ్యాంక్‌ల్లో జమచేయటం, తమ ఖాతాల క్రింద బ్యాంక్‌లు జమచేసుకోవటం జరిగిపోతుంది. కుటుంబ అవసరాలకు డబ్బులకోసం అల్లాడుతున్న రైతాంగానికి ఇది కనీసం ఊరట కలిగించేదిగా కూడా వుండదు.

ప్రభుత్వం ప్రకటించిన అదనపు సహాయం క్రింద 20-4-17 నుండి కొనుగోళ్ళు ప్రారంభించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకు నిబంధనలు ప్రకటించింది. ఈ క్రాస్ బుకింగ్ ద్వారా సొంత భూమి కలిగిన లేదా కౌలు కార్డులు కలిగిన రైతులు పట్టాదారు పాస్ పుస్తకం నకళ్ళతో మిర్చిపంట పొలంలో దిగిన ఫొటోను తప్పనిసరిగా జతపర్చాలి. ఆధార్ ఆధారంగా సాగు అమ్మకం ధృవీకరణ పత్రాలు ఇవ్వాలి. ఈ నిబంధనల వలన అత్యధిక రైతులు అదనపు సహాయానికి దూరమౌతారు. ఇలాంటి పరిస్థితిని ఊహించని రైతులకు పొలంలో ఫొటో దిగాలనే ఆలోచన ఎలా కలుగుతుంది? ఇంకా చాలామంది రైతులకు ఆధార్‌కార్డులు అందలేదు. కౌలురైతులకు కార్డులు యిచ్చినా, రైతులు దానికి ఆమోదం తెలపనప్పుడు పట్టాదారు పాస్‌పుస్తకం కౌలు రైతుకు ఎలా వస్తుంది? ఈ నిబంధనలు గమనిస్తే తాను ఇచ్చే అదనపు సహాయాన్ని, రుణమాఫీని కుదించినట్లుగానే అతితక్కువ మొత్తానికి కుదించనున్నట్లు వెల్లడౌతున్నది. 20 క్వింటాళ్ళకే సహాయాన్ని పరిమితం చేయటంతో, సన్నకారు రైతులు కూడా పూర్తిగా ఈ ప్రయోజనాన్ని పొందలేరు. రైతులందరూ గుంటూరు యార్డులోనే అమ్ముకోవాలనే నిబంధన అనేక సమస్యలు సృష్టించింది. ప్రభుత్వం పెట్టిన నిబంధనలపై తీవ్ర విమర్శలు, రైతాంగంలో వ్యతిరేకత వ్యక్తంకావటంతో రిజిస్ట్రేషన్ నిబంధనలను సడలించే ఆలోచన ఉన్నట్లు ప్రచారం జరుగుతున్నది. ఏమైనా ఈపాటికే ఎక్కువభాగం సన్న, చిన్నకారు రైతులు మిర్చి అమ్ముకొని వుండటంతో, ప్రభుత్వం అందించే సహాయం వారికేవిధంగానూ దక్కదు.

ప్రభుత్వ నిబంధనలతో గుంటూరు మిర్చి యార్డుకు రాష్ట్రం నలుమూలల నుండి మిర్చిని వాహనాల ద్వారా తీసుకొని రావటం, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుండి కూడా పెద్దఎత్తున మిర్చిని తీసుకొని రావటంతో గుట్టలు గుట్టలుగా సరుకు పేరుకుపోయింది. ఇతర రాష్ట్రాల నుండి యార్డుకి మిర్చి రావటంపై విమర్శలు వెల్లు వెత్తడంతో అలా రాకుండా చర్యలు తీసుకొంటామని అధికారులు ప్రకటించారు.

ప్రభుత్వం అదనపు సహాయం ప్రకటించిన తర్వాత మిర్చి ధర మరింతగా పడిపోయింది. కామన్ వెరైటీ కనీస ధర 3 వేల నుండి 2,500 పడిపోయింది. ఇంతకుముందు 4,500రూ. ధర పలికింది. స్పెషల్ వెరైటీ ధర కూడా తగ్గిపోయింది. కామన్ రకానికి ప్రభుత్వం యిచ్చే రాయితీతో 4 వేలకు మించిరాదు. ఇది అందని రైతులకు లభించేది మూడువేలలోపే. ఇలాంటి పరిస్థితి ఉన్నా

మిర్చికి కనీస ధర నిర్ణయించి ప్రభుత్వ సంస్థల ద్వారా కొనుగోలు చేయించకుండా, ప్రభుత్వం వ్యాపారుల దోపిడీకి గురిచేస్తున్నది. ఇదేనా ప్రభుత్వం రైతుల ప్రయోజనం కాపాడటం?

ప్రభుత్వ అదనపు సహాయం తమ ప్రయోజనాలకు తోడ్పడకపోగా ఉన్న ధర కూడా పడిపోవటంతో రైతులు ఆగ్రహం చెంది అనేకచోట్ల ఆందోళనకు దిగారు. మేడికొండూరులో రైతులు మిర్చిని రోడ్లపై పోసి తగల బెట్టారు. 27-4-17న పెనుగంచిప్రోలులో మిర్చి ధర పడిపోవటంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మిర్చి యార్డుకి తీసుకొనివెళ్తే రెండువేలకు అడుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కామన్ రకానికి 8 వేలు, స్పెషల్ వెరైటీకి 10 వేలు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రాలు వేరైనా పాలకుల తీరు ఒకటేనని మరోసారి నిరూపితమైంది. తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం మిర్చి రైతాంగానికి మద్దతు ధర కల్పించకుండా మిర్చి రైతులను వ్యాపారుల దయాదాక్షిణ్యాలకు వదిలివేసింది. ఖమ్మం మార్కెట్ యార్డుకు మిర్చి అమ్మకానికి తెచ్చిన రైతులు, రేటు తగ్గింపు నాటకాలతో కడుపు రగిలి సామూహికంగా మిలిటెంట్ నిరసన తెలియజేశారు. యార్డు పాలకవర్గ కార్యాలయాలలోని సామాగ్రినంతటినీ క్షణాల్లో ధ్వంసం చేశారు. రైతాంగానికి కడుపు మండితే ఎలా వుంటుందో మచ్చుకు తెలియజెప్పారు.

మిర్చి రైతులే కాదు పసుపు రైతుల పరిస్థితి ఇదేవిధంగా ఉంది. రాష్ట్రంలో 21 వేల హెక్టార్లలో పసుపు పంట సాగుచేశారు. ఎకరాకి లక్షన్నర పైగా రైతులకు సాగు ఖర్చు అయ్యింది. సగటు దిగుబడి 20 క్వింటాళ్ళు వస్తుంది. నాలుగు సంవత్సరాల క్రితం క్వింటా 15 వేలు పలికిన పసుపు ధర ఆ తర్వాత దారుణంగా పడిపోయి, రైతాంగం తీవ్రంగా నష్టపోయి అప్పులపాలయ్యారు. గత సంవత్సరం 10 నుండి 12 వేల ధర లభించటంతో ఆశావహ దృక్పధంతో రైతాంగం పుసుపు సాగుచేశారు. తీరా పంట చేతికి వచ్చిన తర్వాత క్వింటాల్ ధర 5 వేలకు పడిపోయింది. ఇతర పంటల లాగానే పుసుపు ధర తగ్గుదల, పెరుగుదల వ్యాపారుల చేతుల్లోకి పోయింది. వారి దయా దాక్షిణ్యాలపై ధరలు నిర్ణయించబడుతున్నాయి.

ప్రస్తుతం లభిస్తున్న పసుపు ధర వలన రైతులకు పెట్టుబడి కూడా రాని పరిస్థితి ఏర్పడింది. ధర పతనంపై తీవ్ర ఆగ్రహం చెందిన రైతాంగం ఆందోళనకు దిగారు. న్యాయమైన ధర కల్పించాలనీ, మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయించాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అందుకు అంగీకరించక తప్పలేదు. మొదటి రకానికి రూ. 6,500; రెండవ రకానికి రూ. 6,000 ధరతో ఈ నెల 24-4-17 నుండి 7-6-17 వరకు మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేయిస్తానని ప్రకటించింది.

రైతుల పసుపు కొనుగోళ్ళలో యార్డు అధికారులు - వ్యాపారులు కుమ్మక్కై రైతాంగాన్ని అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారు. రాష్ట్రంలోని పసుపు ఉత్పత్తి రైతులందరూ దుగ్గిరాల యార్డుకు తీసుకొని రావటం ప్రారంభించారు. యార్డు అధికారులు కొనుగోళ్ళకు అనేక ఆంక్షలు పెడుతున్నారు. సరుకు బాగాలేదని, సన్నకొమ్ములు ఏరివేయాలనీ నిబంధన పెడుతున్నారు. ఈ కారణాలు చూపెట్టి ధర తగ్గిస్తున్నారు. గ్రేడింగ్ చేశామని రైతులు చెబుతున్నా యార్డు అధికారులు పట్టించుకోవటంలేదు. గ్రేడింగ్ చేయందే కొనుగోలు చేయబోమని బెదిరిస్తున్నారు. అధికారుల చర్య వలన రైతులు అదనపు ఖర్చు భరించాల్సి వస్తున్నది. వ్యాపారులు చెప్పిన సరుకునే కొనుగోలు చేస్తున్నారు. అది కూడా నామమాత్రంగా కొనుగోలు చేస్తూ రైతులను వ్యాపారుల వద్దకు వెళ్ళేలా చేస్తున్నారు. యార్డు అధికారుల వేధింపులతో 5,500 రూ.లకే వ్యాపారులకు రైతులు అమ్ముతున్నారు. రైతుల నుండి తక్కువ ధరకు కొన్న సరుకును వ్యాపారులు అధిక ధరకు మార్క్‌ఫెడ్‌కి అమ్ముతున్నారు. ఇది వ్యాపారుల - అధికారుల కుమ్మక్కుకు అద్దం పడుతున్నది.

యార్డుకి తెచ్చిన పసుపును నాణ్యతలేదనే పేరుతో కొనుగోలు చేయకపోవటం, కొన్నా తక్కువ ధర ఇవ్వటంతో దిక్కుతోచని రైతులు ఆత్మహత్యలకు సిద్ధపడ్డారు. అచ్చంపేట మండలం గ్రంధసిరి గ్రామానికి చెందిన ఇద్దరు రైతులు యార్డు పాలనా భవనంపైకి ఎక్కి ఆత్మహత్యకు సిద్ధపడ్డారు. మార్కెట్ సిబ్బంది అడ్డుకొనటంతో వారి ప్రాణాలు నిలిచాయి. దీన్ని గమనించిన రైతులందరూ ఐక్యంగా ప్రధాన గేట్ వద్ద బైఠాయించి నిబంధనలు ఉపసంహరించాలనీ, న్యాయమైన ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మిర్చి, పసుపు రైతుల సమస్య ఎడల ఏమాత్రం చిత్తశుద్ధివున్న ప్రభుత్వం అయినా అందుకు తగిన చర్యలు తీసుకొనేది. ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటుచేసి రైతాంగం తక్కువ ధరకు అమ్ముకోకుండా చూసేది. కుటుంబ అవసరాలకు మార్కెట్ కమిటీల ద్వారా వడ్డీలేని రుణాలు, బ్యాంక్‌ల నుండి రుణాలు అందేలా చేసేది. బడా వ్యాపారుల మోసాలను అడ్డుకొనేది. మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్ళు చేయించేది. రైతులకు శీతల గిడ్డంగులు యిచ్చేలా వాటి యజమానులను ఆదేశించేది. ఇలాంటి చర్యలు చేపట్టకుండా బడా వ్యాపారులకు తోడ్పడే విధంగా వ్యవహరిస్తున్నది.

ప్రభుత్వ విధానాలను అర్థంచేసుకొని క్వింటాల్ రూ. 12వేల చొప్పున రైతులవద్ద ఉన్న మిర్చిని మార్క్‌ఫెడ్ కొనుగోలు చేయాలని, ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసి ఆర్థిక సహాయం అందించాలని, వ్యాపారుల దోపిడీని అరికట్టాలని రైతాంగం ఉద్యమించటం తప్ప సమస్యకు మరో మార్గంలేదు.

ooooo